

తెలుగు వైభవం!





సభలో మాట్లాడుతున్న బీజేపీ నేత రామ్‌మాధవ్, వేదికపై గవర్నర్ బిశ్వభూషణ్, స్వరూపానందేంద్ర, యార్లగడ్డ, చైతన్యరాజు తదితరులు.. సభలో పాల్గొన్న భాషాభిమానులు

- అట్టహాసంగా ప్రారంభమైన 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- హాజరైన ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్
- మహాసభలను ప్రారంభించిన స్వరూపానందేంద్ర
- 10 వేల మంది విద్యార్థులతో వేమన శతక ఆలాపన
- తొలిరోజు కవి సమ్మేళనం, భాషా ప్రక్రియలపై సదస్సు
- పలువురికి పూర్ణ కుంభ పురస్కారాలు

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 5: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లను పురస్కరించుకుని తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నారు. రాజరాజనరేంద్ర, నన్నయ భట్టారక, నారాయణ భట్టు వేదికలపై సందడిగా తెలుగుదనం ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షత వహించిన ప్రధాన వేదిక శ్రీరాజరాజ నరేంద్ర వేదిక నుంచి విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి తెలుగు మహాసభలను లాంఛనంగా ప్రారంభించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, చత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఆర్ఎస్ఎస్ జాతీయ కార్యదర్శి వారణాసి రామ్‌మాధవ్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, విశ్వనాథ గోపాలకృష్ణ, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వీసీ ప్రసాదరాజు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ మాట్లాడారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలి : బిశ్వభూషణ్

శ్రీకృష్ణ భగవానుడు గీతలో బోధించిన యదా యదా హి ధర్మస్య.. అంటూ మహా భారతాన్ని ఆదికవి నన్నయ తెలుగున అనువదించడాన్ని ప్రస్తావిస్తూ తెలుగుభాష విశిష్టత, ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా ఇటువంటి సదస్సులు నిర్వహించడంపై ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నిర్వాహకులను అభినందించారు. సాహిత్య, సాంస్కృతిక కళలకు నిలయంగా శోభిల్లుతున్న గోదావరి తీరాన తెలుగు మహాసభలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గోదావరినది అన్నా, రాజమహేంద్రవరం అన్నా తనకు ఎంతో అభిమానమన్నారు. ముందుగా విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి మాట్లాడుతూ తెలుగు భాషలాంటి భాష ఈ సృష్టిలో లేదన్నారు. ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నప్పటికీ తెలుగు భాష మాధుర్యం, గొప్పతనం మరే భాషకు సాటిరాదని, తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సంస్కృతం కన్నా తెలుగులోనే ఎక్కువ అక్షరాలు ఉన్నాయన్నారు. బీజేపీ జాతీయ నేత రామ్‌మాధవ్ మాట్లాడుతూ తెలుగు భాషకు 2500 ఏళ్ల చరిత్ర, 1700 ఏళ్ల సాహిత్య చరిత్ర ఉందన్నారు. మన సంస్కృత భాషను మృతభాష అని ఆంగ్లేయులు వర్ణించారని, భాషలు బలహీనపడతాయేగానీ మరణించవన్నారు. వాటిని జీవింపజేసే ప్రయత్నం కింది స్థాయి నుంచి జరగాల్సి ఉందన్నారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేలను సస్యశ్యామలం చేసిన సర్‌ఆర్థర్ కాటన్, తెలుగు నిఘంటువు రూపొందించిన సీపీ బ్రౌన్, అలాగే గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం ప్రాతఃస్మరణీయులన్నారు. తెలుగు వారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన నందమూరి తారకరామారావు, రాజ్యసభలో ఎవరి మాతృభాషలో వారు మాట్లాడే వీలు కల్పించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులను గుర్తు పెట్టుకోవాలన్నారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ చదువుకన్నా సంస్కారం ప్రధానమైందని, తెలుగుభాష నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. అ అంటే అమ్మ అని, ఆ అంటే ఆవు అని నేర్చుకున్న మాటలను గుర్తుచేస్తూ అమ్మ ప్రేమకు సంకేతమైతే, ఆవు త్యాగానికి సూచికగా చెప్పారు. తెలుగు నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. మాతృభాషపై అభిమానం ఉండాలన్నారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ తల్లి లాంటి తెలుగు భాషను మరువకూడదన్నారు. మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ తమిళ ప్రాంత పాలనలో ఉన్న యానాం నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన తాను అసెంబ్లీలో తెలుగులోనే మాట్లాడేవాడినని గుర్తుచేశారు. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అంతర్గత భావాలను వ్యక్తపరచడానికి మాతృభాష దోహదం పడుతుందన్నారు. జేఎన్టీయూ వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ తెలుగు మహాసభల నిర్వహణతో తెలుగుపై అందరికీ మమ కారం ఏర్పడుతుందన్నారు. చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ మహాసభల నిర్వహణతో సరిపెట్టుకోకుండా తెలుగు భాష ఉన్నతికి తమ కుటుంబం తరపున ట్రస్ట్ ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషలోని మాధుర్యాన్ని అందరూ ఆస్వాదించి, ప్రతి ఒక్కరూ తెలుగు భాష నేర్చుకోవాలన్నారు. తెలుగు భాషపై పట్టు సాధిస్తే ఇతర భాషలపై కూడా పట్టువస్తుందన్నారు. తాను 121 భాషల్లో గజల్స్ పాడానని చెబుతూ ఆయా భాషల వాళ్లు ఆ గజల్స్‌ను ఎంత అనందించారో చెప్పనలవికాదన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రవివర్మ, ఆంధ్రసారస్వత పరిషత్ ముఖ్య సలహాదారులు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, రెడ్డప్ప ధవేజీ, కోట్ల కనకేశ్వరరావు, మంతెన కేశవరాజు, వేటుకూరి సూర్యనారాయణరాజు, తెలుగు మహాసభల సమన్వయకర్త సునంద రమేష్, అపుస్మా అధ్యక్షుడు సంకవల్లి మురళి, పలువురు కవులు, రచయితలు, భాషాభిమానులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం, భాషా ప్రక్రియపై సదస్సు

నారాయణభట్టు వేదికపై ఏర్పాటుచేసిన కవి సమ్మేళన అంకురార్పణ సభలో మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వైభవ కీర్తి అందరూ ఆనందించదగినదన్నారు. కవులు, రచనలు చేసేవారు వీరేశలింగం పంతులును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్రాల వారు భాషను కాపాడుకోవడానికి చేస్తున్న ఉద్యమాలను వివరించారు. కవులు తమ కవితలు ద్వారా జాతిని జాగృతం చేస్తూ తెలుగు భాషను నిలబెట్టుకోవాలని సూచించారు. ఆది కవి నన్నయ వేదికపై ఏర్పాటుచేసిన సదస్సుల అంకురార్పణ సభలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రవచనాలు, కావ్యాలు, పద్యాలు నేర్పించాలన్నారు. సంసారంలో సమస్యలకు సాహిత్యంతో పరిష్కారం లభిస్తుందని ప్రవచించారు. ప్రతిభావంతులను ఎవరూ అడ్డుకోలేరన్నారు. తిరుపతి వేంకట కవులు, చెళ్లపిళ్ల కవుల్లో దాగిన ప్రతిభకు ఎవరూ సాటిరారని చెప్పారు.



ఎంపీ, సినీ రచయిత విజయేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం



తెలుగు మహాసభల సందర్భంగా వేదికపై ప్రదర్శిస్తున్న నృత్యరూపకం

తెలుగు జాతికి సేవలందించినవారు ధన్యులు

ఘనంగా పూర్ణకుంభ అవార్డుల ప్రదానోత్సవం

- 7లో

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో..

నేడు రాజమహేంద్రవరంలో ముత్యాల ముగ్గుల పోటీలు



రాజమహేంద్రవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది వచ్చినట్టే ఈ ఏడాది ముగ్గుల పండుగ వచ్చేసింది.. రాజమహేంద్రవరం పట్టణం జేఎన్ రోడ్డులో రిలయన్స్ డిజిటల్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయి జూనియర్ కాలేజీ ఆవరణలో "ఆంధ్ర జ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈ నెల 6న శనివారం జరగనున్నాయి.ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత ఈ పోటీలను ప్రారంభిస్తారు. ఇక జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన భవానీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరిస్తోంది. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్లు నమోదుకు 9985411248 నెంబర్‌లో సంప్రదించగలరు. పోటీల్లో జిల్లావ్యాప్తంగా మహిళలు పాల్గొనవచ్చు.



ఎంపీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

రాజమహేంద్రవరంలో మూడో రోజుకు చేరిన సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5: రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్మిక జేఏసీ పిలుపు మేరకు పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు శుక్రవారం రాజమహేంద్రవరంలో భిక్షాటన చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు పనిముట్లు కొనుగోలు చేసేందుకు నిధులు లేవని, టాయిలెట్ క్లీనింగ్ వర్కర్లకు జీతాలు లేవన్నారు. వారి సమస్యలు ఏవీ పరిష్కారం కాలేదన్నారు. పైగా సమ్మెలో కార్మికులుంటే వర్కర్ల సమస్యలపై స్పందించాల్సిన కమిషనర్ ప్రత్యామ్నాయ పనులు చేయించేందుకు చూస్తున్నారని చెప్పారు. రోజువారీ కూలీలను పెట్టి పనులు చేసేందుకు చూస్తున్నారే తప్ప కార్మికుల సమస్యలపై స్పందించకపోవడం దారుణమన్నారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులు ఎంపీ భరత్‌రామ్‌కు వినతిపత్రం అందించారు. తాను సీఎంతో మాట్లాడి సమ్మె పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుంద్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, యూనియన్ నాయకులు రెడ్డి రమణ, ముత్యాల మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల కిషోర్, బంగారు గిరి, కాకి శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోండి: ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమ్మె చేస్తున్నందు వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ అధికారులను ఎంపీ భరత్‌రామ్ ఆదేశించారు. ఈ మేరకు వారితో సమావేశాన్ని నిర్వహించారు. సమ్మె వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. చాలాచోట్ల శానిటేషన్ అధ్వానంగా కనిపిస్తోందని, సమ్మె కొలిక్కి వచ్చేవరకూ పారిశుధ్యాన్ని అలా వదిలేయడం భావ్యం కాదన్నారు. సమ్మె పరిష్కార నిర్ణయం ప్రభుత్వం చేతుల్లో ఉందని చెప్పారు.

చాముండేశ్వరి చిట్‌ఫండ్స్‌లో తనిఖీలు

ఇది ఓ వైసీపీ ప్రజాప్రతినిధి పనేనని ప్రచారం

రాజమహేంద్రవరం, జనవరి5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని చాముండేశ్వరి చిట్‌ఫండ్స్ కంపెనీ మీద స్టాంప్స్ అండ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారులు దాడులు చేశారు. ప్రముఖ చిట్‌ఫండ్ వ్యాపారి చలుమూరి శ్రీనివాసరావుకు చెందినది ఈ చాముండేశ్వరి చిట్‌ఫండ్స్, ఆయన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకు బంధువు కూడా. ఈ దాడులు కావాలనే ఓ వైసీపీ ప్రజాప్రతినిధి చేయిస్తున్నారని, గతంలో జగదీశ్వరి చిట్‌ఫండ్స్ కంపెనీల మీద, ఇవాళ చాముండేశ్వరి చిట్‌ఫండ్స్ మీద ఉద్దేశపూర్వకంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కానీ ఈ తనిఖీల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా లేదా అనేది అధికారులు స్పష్టం చేయలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజమహేంద్రవరంలో కక్షపూరిత, ప్రతిపక్ష నేతలకు సంబంధించిన వ్యాపారాలను దెబ్బతీసే ప్రయత్నాలు మొదలయ్యాయని, ఇది మంచి పద్ధతి కాదనే వాదన కూడా ఉంది.

నవరత్నాల కింద ద్వైవార్షిక నగదు రూ. 411.74 లక్షలు జమ : కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవరత్నాల్లో భాగంగా ఏడు పథకాల కింద 2705 మంది లబ్ధిదార్లకు ద్వైవార్షిక మంజూరు కింద రూ. 411.74 లక్షలు ఆయా లబ్ధిదార్ల ఖాతాలో జమ అయినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఎంపీ మార్గాని భరత్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర, చందన నాగేశ్వర్, మేడపాటి షర్మిళారెడ్డి పాల్గొన్నారు.



వృద్ధులతో భూ రీసర్వే కార్యక్రమం నిర్వహించిన తహశీల్దారు

అభాసుపాలవుతున్న భూ రీసర్వే కార్యక్రమం

గోకవరం, జనవరి 5: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూరీసర్వే కార్యక్రమం ఎక్కడికక్కడ అభాసుపాలవుతోంది. ఎంతోకాలం నుంచి కాపాడుకుంటూ వస్తున్న పంట భూములు రీసర్వే పేరుతో రైతుల మధ్య తగాదాలు పెట్టే రీతిలో అధికారుల చర్యలు ఉంటున్నాయంటూ సన్న, చిన్నకారు రైతులు లబోదిబోమంటున్నారు. వాస్తవానికి రీసర్వే నిర్వహించే సమయంలో భూయజమానులతోపాటు సరిహద్దు రైతులకు కూడా సమాచారం చేరవేసి రెవెన్యూ అధికార్లు రీసర్వే నిర్వహించాలి. కానీ అటువంటి చర్యలు ఎక్కడా కనిపించడంలేదు. సంబంధింత రైతులు లేకుండానే సర్వేను అధికారులు ఇష్టానుసారంగా చేసేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. దీంతో సర్వే అనంతరం భూముల మధ్య హెచ్చు తగ్గులు ఉన్నాయంటూ రైతులకు నోటీసులు పంపించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఈక్రమంలో బాధిత రైతులు తమ భూమిని యథాస్థానంలో నిలుపుకోవడానికి ఆర్థికంగా కూడా నష్ట పోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. కాగా గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో భూరీసర్వేపై శుక్రవారం తహశీల్దారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అయితే రైతులెవరూ లేకుండానే రామాలయం వద్ద కూర్చొన్న నలుగురు వృద్ధులతో గ్రామసభను మమ అనిపించడంపై రైతులు మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న కొంతమంది రైతులు గ్రామసభ వద్దకు చేరుకొని రీసర్వే తీరుపై అధికారులను నిలదీశారు. ఇటీవల జరిపిన రీసర్వేను రద్దు చేసి తిరిగి మరోమారు తమ గ్రామంలో రీసర్వే చేయాలంటూ గ్రామ రైతులు అధికారులను డిమాండు చేశారు.



తెలుగుజాతికి వివిధ రంగాల్లో సేవలందించిన తనికెళ్ల భరణి, మండలి బుద్ధప్రసాద్, తదితరులకు పూర్ణకుంభ పురస్కారాలను అందజేస్తున్న జస్టిస్ కృష్ణమోహన్, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య కొలకలూరి ఇనాక్, చైతన్యరాజు, గజల్ శ్రీనివాస్







వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో అలరించిన విద్యార్థులు





తెలుగు మహాసభలకు హాజరైన విద్యార్థులు

తెలుగు జాతికి సేవలందించినవారు ధన్యులు

● తెలుగు మహాసభల్లో జస్టిస్ కృష్ణమోహన్ ● పూర్ణకుంభ అవార్డుల ప్రదానోత్సవం ● గైట్ కళాశాలలో అంతర్జాతీయ తెలుగు మహాసభలు



గైట్ కళాశాలలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పాల్గొన్న కవులు, రచయితలు, ప్రముఖులు

రాజానగరం, జనవరి 5: తెలుగుజాతికి పూర్వీకులు అందించిన సేవలను గుర్తించుకుని వారి వారసులను సత్కరించడం అభినంద నీయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో గైట్ కళాశాలలో జరుగుతున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో భాగంగా శుక్రవారంరాత్రి రాజరాజ నరేంద్రుని వేదికపై నిర్వహించిన పూర్ణకుంభ అవార్డుల ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలుగుజాతికి ఎందరో మహనీయులు అంకితభావం, సేవాభావంతో పనిచేసి ఆనందంగా జీవించారని, అలాగే మనందరం పనిచేసి రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు.

ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే జరగాలి

మహోన్నత చరిత్ర కలిగిన తెలుగువారందరికీ మనం ప్రతినిధులమన్న సంగతి మర్చిపోకుండా ఈ వారసత్వాన్ని భవిష్యత్తుతరాలకు అందించాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగు భాష, జాతి అనేక సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో విద్యార్థులకు తెలుగుజాతి ప్రతిభ, చైతన్యాన్ని పరిచయం చేయడం అభినందనీయమన్నారు. రాజమహేంద్రవరంలో సాంస్కృతిక వారసత్వం పుణికిపుచ్చుకున్న వాళ్లు ఎందరో ఉన్నారని, అందుకే ఇది సాంస్కృతి రాజధాని అని పేర్కొన్నారు.

పురస్కారాలు అందించడం అభినందనీయం

● సినీ రచయిత తనికెళ్ల భరణి

సినీ రచయిత తనికెళ్ల భరణి మాట్లాడుతూ ఇంతమంది గొప్ప తెలుగువారి వారసులను ఒకే వేదిక మీదకు రప్పించి పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. ఇంతమందిని చూశాక తన జన్మ ధన్యమైందన్నారు. గజల్ శ్రీనివాస్ తలపెట్టిన తెలుగుసభల నిర్వహణకు సహకరించడం చైతన్యరాజు చిరకాలం గుర్తుంటారని భరణి పేర్కొన్నారు.

ఘనంగా పూర్ణకుంభ పురస్కారాల ప్రదానం..

తెలుగుజాతికి సేవలందించిన వివిధ రంగాల ప్రముఖుల వారసులు అలాగే వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులకు పూర్ణకుంభ పురస్కారాలతో జస్టిస్ కృష్ణమోహన్, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్య కొలకలూరి ఇనాక్, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ గౌతమ్‌రెడ్డి చేతులమీదుగా చైతన్యరాజు, గజల్ శ్రీనివాస్ అందజేశారు. తరిగొండ వెంగమాంబ, కవయిత్రి మొల్ల, తిక్కన సోమయాజి, డొక్కా సీతమ్మ, పరవస్తు చిన్నయసూరి, గుర్రం జాషువా, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, పెద్దింటి దీక్షిత్‌దాసు, ఘంటసాల వెంకటేశ్వరరావు, మండలి వెంకట కృష్ణారావు, సాలూరి రాజేశ్వరరావు, పీబీ శ్రీనివాస్, జంధ్యాల, మునా రాయలు, బాపు తదితరుల వారసులు పురస్కారాలు స్వీకరించారు. అలాగే విశ్వనాథ గోపాలకృష్ణ, దాట్ల బుచ్చి వెంకటపతిరాజు, జీత్‌మోహన్‌మిత్ర, ఎర్రాప్రగడ రామకృష్ణ, కూచిబొట్ల ఆనంద్, రసరాజు, బాదం బాలకృష్ణ, వంశీ రామరాజు, చెరుకువాడ రంగసాయి, తనికెళ్ల భరణి, గౌతమీ గ్రంథాలయం, నన్నయ భట్టారక పీఠం, చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ పతినిధులు పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, గైట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శశికిరణ్ వర్మ, ఆంధ్ర సారస్వత పరిషత్ ముఖ్య సలహాదారు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





అంతర్జాతీయ తెలుగు మహాసభలలో జరుగుతున్న సాహితీ సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త గరికపాటి నర్సింహారావు, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ కృష్ణమోహన్

మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎస్టీ కాదు

● ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అప్పీలుపై జీవో జారీచేసిన ప్రభుత్వం

● 2016లో ఎస్టీగా నిర్ధారించిన తూర్పు కలెక్టరు ఉత్తర్వులు రద్దు

రంపచోడవరం, జనవరి 5: అరకు మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు కొత్తపల్లి గీత ఎస్టీ కులస్తురాలు కాదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2016లో ఆమెపై జరిగిన కులవిచారణ నివేదిక ఆధారంగా అప్పటి తూర్పుగోదావరి జిల్లా కలెక్టరు సదరు కొత్తపల్లి గీత ఎస్టీ (వాల్మీకి) కులస్తురాలేనంటూ నిర్ధారిస్తూ ఉత్తర్వులను ఇచ్చారు. దీనిపై ఏపీ ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఇ. అంజనేయులు, ఆర్.మహేశ్వరరావు సదరు కలెక్టరు ఉత్తర్వులను ఆక్షేపిస్తూ ప్రభుత్వం వద్ద 2016లోనే అప్పీలు దాఖలు చేశారు. ఈ అప్పీలుపై తెలుగుదేశం ప్రభుత్వంలోనూ, వైకాపా ప్రభుత్వంలోనూ మొత్తం నలుగురు మంత్రులు విచారణ జరిపారు. ఇటీవల కాలంలో ఈ అప్పీలుపై జరుగుతున్న విచారణ తీరుపై కొత్తపల్లి గీత రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. 2023 ఏప్రిల్‌లో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేస్తూ నాలుగు నెలల్లో ఈ అప్పీలును ముగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ అప్పీలు కేసును ప్రస్తుత గిరిజన సంక్షేమ మంత్రి పి.రాజన్నదొర విచారణ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం గురువారం నాడు గిరిజన సంక్షేమ (కుల విచారణ) విభాగం ద్వారా జీవో ఎమ్ఎస్.నెం.2ను జారీ చేస్తూ 2016లో కొత్తపల్లి గీతను ఎస్టీగా నిర్ధారిస్తూ అప్పటి కలెక్టరు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తూ ఆమె ఎస్టీ కాదని ప్రభుత్వం పేర్కొంది.

ఘంటసాలకు నివాళులర్పించిన కోడలు పార్వతి



ఘంటసాల పార్వతిని సత్కరిస్తున్న కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

ధవళేశ్వరం, జనవరి 5: ధవళేశ్వరం ఇరిగేషన్ పార్కులో ఏర్పాటుచేసిన అమరగాయకుడు ఘంటసాల విగ్రహాన్ని ఆయన కోడలు ఘంటసాల పార్వతి, టీవీ యాంకర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ శిల్పతో కలిసి సందర్శించి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఘంటసాల కోడలు కావడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఆమెను గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటుచేసిన అసోసియేషన్ సభ్యులను ఆమె అభినందించారు. రాక రమణ, యర్రమోతు ధర్మరాజు, గ్రంధి జగన్నాథం, తాతారావు, శేషకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిఠాపురంలో విజిలెన్స్ తనిఖీలు

● 29.6క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం ● ఇద్దరిపై కేసు నమోదు

పిఠాపురం, జనవరి 5: కాకినాడ జిల్లా పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారంతో అధికారులు పలు వాహనాలను పరిశీలించారు. మినీవ్యాన్‌లో తరలిస్తున్న 48 సంచుల్లో ఉన్న 24.10క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తుంచారు. కార్డుదారులు, ఎండీయూ ఆపరేటర్ నుంచి కిలో రూ.20లకు వీటిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. కార్డుదారులకు రేషన్‌సరుకులు అందించాల్సిన ఎండీయూ వాహనాన్ని రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. 11 సంచుల్లో ఉన్న 5.50 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. రెండు వాహనాల్లో ఉన్న 29.60 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎండీయూ వాహనం, మినీ వ్యాన్‌లను సీజ్ చేశారు. రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఎండీయూ ఆపరేటర్ పైలా శ్రీను, కందరాడకు చెందిన సీహెచ్.లక్ష్మణరావులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.



పిఠాపురంలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం, వాహనాలు

ఇటలీ నుంచి వచ్చి.. ఆటో కొని..

● పర్యాటక ప్రాంతాలను చుట్టేస్తున్న విదేశీయులు

● పొల్లూరు ట్రైగ్రీస్ జలపాతం వద్ద ఇటలీవాసుల సందడి

మోతుగూడెం, జనవరి 5: అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో గురువారంరాత్రి నుంచి ఇటలీ దేశస్థులు మోతుగూడెం, పొల్లూరులో సందడి చేశారు. వీరు ఇటలీ నుంచి ఢిల్లీ వచ్చారు. ఢిల్లీ నుంచి కేరళ వెళ్లి కొచ్చిలోని ప్రకృతి అందాలను చూస్తూ కాలం గడిపారు. తర్వాత ఆటో కొనుగోలుచేసి కొచ్చి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజుజిల్లా మోతుగూడెం ప్రాంతంలోని ప్రకృతి అందాలను చూడ్డానికి వచ్చామన్నారు. మోతుగూడెం పరిసర ప్రాంతాల్లో ఉన్న పొల్లూరు జలపాతం, ఫోర్‌బై కెనాల్, డొంకరాయి డ్యామ్ చూసి మేఘాలయ పయనమయ్యారు.



పొల్లూరు ట్రైగ్రీస్ జలపాతం సందర్శనకు వచ్చిన ఇటలీ వాసులు

పూల ప్రేమికులకు ఆహ్వానం



ఆకర్షిస్తున్న రంగురంగుల పుష్పాలు

● నేడు ఫలపుష్ప ప్రదర్శన, ప్రజా ఉత్సవాలు ప్రారంభం

యానాం, జనవరి 5: తూర్పుగోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో పూలప్రేమికులను ఆహ్లాదపరిచేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 22వ ఫలపుష్ప ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో గత 20 సంవత్సరాలుగా ఈ ఉత్సవాలను జనవరి 6నుంచి8 వరకూ మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. నేడు ప్రారంభం కానున్న ఈ ఫలపుష్ప ప్రదర్శనకు పుదుచ్చేరి మంత్రులతోపాటు ఉన్నాతాదికారులు, పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ వివిధశాఖల అధికారులు హాజరుకానున్నారు. ముఖ్యంగా ఈ ఫలపుష్పప్రదర్శన యానాం, పరిసర ప్రాంత ప్రజలకు మంచి ఆహ్లాదకర వాతావర ణాన్ని చేకూరుస్తోంది. వీటిలో తూర్పుగోదావరి జిల్లాలోని కడియం, రాజమహేంద్రవరం, బెంగుళూరు, తదితర ప్రాంతాల నుంచే కాకుండా యానాం వ్యవసాయశాఖ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పెంచుతున్న వివిధ రకాల జాతులు ఫలపుష్పాలను ప్రదర్శనకు ఉంచుతారు. అన్ని ఏర్పాట్లు స్థానిక వ్యవసాయ శాఖ డీడీ శివసుబ్రహ్మణ్యన్ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే వివిధ నర్సరీల నుంచి అనేక రకాల పూలమొక్కలు యానాం చేరుకున్నాయి. నేడు సాయంత్రం 4గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు జరిగే ఈ ఫలపుష్ప ప్రదర్శనలో ప్రజల నందరినీ ఆకర్షించే విధంగా వివిధ రకాల స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ రఘునాయగం ఆధ్వర్యంలో సీఐ షణ్ముగం గట్టి బందోబస్తును సిద్ధం చేశారు.



ప్రదర్శనలో ఉంచిన వివిధ రకాల ఫలపుష్పాలు



ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

ఆశ్రమ పాఠశాల బాలిక మృతి

● హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యమంటూ బంధువుల రాస్తారోకో

● ట్రైబల్ వెల్ఫేర్ డీడీతో విచారణ జరిపించనున్న ఐటీడీఏ పీవో

కూనవరం, జనవరి 5: కూనవరం మండలం నర్సింగపేట ఆశ్రమ పాఠశాలకు చెందిన మడకం సంధ్య(12) కడుపునొప్పితో మృతి చెందింది. ఈ మృతికి ఆశ్రమ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్ నిర్లక్ష్యం అంటూ బాలిక బంధువులు ఆశ్రమ పాఠశాల ఎదుట పెద్దఎత్తున నాలుగు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం ఎటపాక మండలం ఎర్రబోరు గ్రామానికి చెందిన సంధ్య నర్సింగపేట ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. ఈనెల 1న తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. కడుపునొప్పితో సంధ్య బాధపడుతూనే ఉంది. ఆ సమయంలో పాఠశాల సిబ్బంది నూతన సంవత్సర వేడుకల్లో మునిగితేలడంతో సంధ్యను పట్టించుకోలేదని బంధువులు చెబుతున్నారు. కనీసం సిబ్బంది అందుబాటులో కూడా లేరని బంధువులు ఆరోపిస్తున్నారు. తెల్లారి రెండో తేదీన సంధ్య కడుపునొప్పితో బాధపడుతూనే పాఠశాల సిబ్బందికి తెలియజేసింది. పాఠశాలలో పని చేస్తున్న ఆయాతో కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సంధ్య వెంట పాఠశాల వార్డెన్‌గాని, టీచర్‌గాని వెళ్లలేదు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న సంధ్య పాఠశాలకు తిరిగివచ్చి పాఠశాలలోని సిక్ రూమ్‌లో ఉంది. అదే సమయంలో ఎర్రబోరుకు చెందిన ఓ మహిళ అదే పాఠశాలలో చదువుతున్న తన కూతురిని చూడటానికి వచ్చింది. సిక్‌రూమ్‌లో ఉన్న సంధ్య ఆరోగ్య పరిస్థితి గమనించి ఇంటికివెళ్లి బాలికకు తల్లిదండ్రులు ఎవరు లేకపోవడంతో సంధ్య పెద్దమ్మకు ఆ మహిళ విషయం తెలియజేసింది. హుటాహుటిన పాఠశాలకు వచ్చిన ఆమె సంధ్యను తమ ఇంటికి తీసుకువెళతానని పాఠశాల హెచ్‌ఎంకి తెలిపింది. పాఠశాల సిబ్బంది తెలివిగా తీసుకువెళితే తమకు ఎటువంటి బాధ్యతలేదని లెటర్ రాయించుకుని సంధ్యను ఇంటికి పంపించారు. అయితే ఇంటికి వెళ్లాక 4వ తేదీన మళ్లీ సంధ్యకు తీవ్ర కడుపునొప్పి రావడంతో ఎర్రబోరునుంచి భద్రాచలం ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మార్గమధ్యలోనే సంధ్య మరణించింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే సంధ్య చనిపోయిందంటూ ఆమె బంధువులు మృతదేహన్ని తీసుకువచ్చి రాస్తారోకో నిర్వహించారు. సుమారు 4గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. విచారణ జరిపిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. శనివారం ట్రైబల్‌వెల్ఫేర్ డీడీని విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య విచారణకు ఆదేశించారు.



బాలిక మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు, టీడీపీ నాయకులు, ఇన్‌సెట్‌లో బాలిక సంధ్య

కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందిన అంతర్వేది వాసి



కొల్లాబత్తుల కుమార్‌రత్నం

అంతర్వేది, జనవరి 5: సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామానికి చెందిన కొల్లాబత్తుల కుమార్‌రత్నం(50) గుండెపోటుతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. పది సంవత్స రాలు కువైట్ దేశంలో పనిచేసుకుంటూ రెండు, మూడుసార్లు స్వదేశానికి వచ్చి మళ్లీ అదే దేశంలో ఉద్యోగం చేస్తుండగా గుండె పోటు రావడంతో మృతి చెందారు. కుమార్ రత్నానికి భార్య పాప ఉన్నారు. ఆర్థిక పరిస్థితి బాగోలేక పొట్ట చేత పట్టుకుని కువైట్ వెళ్లిన కుమార్‌రత్నం మరణవార్త వినగానే కుటుంబ సభ్యులంతా శోకసంద్రంలో మునిగితేలారు. కువైట్ తెలుగు సేవలు సంస్థ ఆధ్వర్యంలో మృతదేహన్ని స్వగ్రామానికి పంపిస్తున్నట్టు జి.మురళి తెలిపారు. కువైట్‌లో మంగళవారం గుండెపోటుతో మృతి చెందిన కుమార్‌రత్నం మృతదేహన్ని శుక్రవారం సాయంత్రం అంతర్వేది చేరుకోవడానికి కువైట్ తెలుగు సేవాసంస్థకు పలువురు సహకరి ంచారని అంతర్వేది గ్రామస్థులు తెలిపారు.

నేడు కల్యాణోత్సవాలపై సమీక్షా సమావేశం

అంతర్వేది, జనవరి 5: మాసమాసంలో ప్రారంభమయ్యే అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలపై ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సమీక్షాసమావేశం నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట, జనవరి 5: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామ శివారున పొలాల్లో చెట్టుకొమ్మ కు ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. వీఆర్వో ఇచ్చిన సమాచారంతో సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడు దండంగి రాంబాబు(35)గా ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

పోలవరం గ్రామసభ వాయిదా

కూనవరం, జనవరి 5: నిరసనల మధ్య పోలవరం గ్రామసభ వాయిదాపడింది. కూనవరం, టేకులబోరు గ్రామానికి పోలవరం అవార్డు ఎంక్వైరీ గ్రామసభను అధికారులు గురువారం నుంచి నిర్వహిస్తున్నారు. అయితే తమకు ఎంతపరిహారం ఇస్తారో తెలపకుండా ఖాళీపేపర్లపై సంతకాలు చేయించుకుంటున్నారంటూ ఈ సభ మాకు వద్దంటూ పోలవరం నిర్వాసితులు గత రెండురోజులుగా నిరసనలు తెలుపుతున్నారు. అధికారులు మాత్రం నిర్వాసితుల సమస్యలు పట్టించుకోకుండా రెండురోజులుగా సభను కొనసాగిస్తూనే ఉన్నారు. దీంతో శుక్రవారం విసుగుచెందిన పోలవరం నిర్వాసితులు నేరుగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫోన్‌ద్వారా ఈ సమాచారాన్ని వివరించారు. ఫోన్‌లో నిర్వాసితుల సమస్య విన్న కలెక్టర్ నిర్వాసితులకు ఎంత సొమ్ము వస్తుందో ఇంటి వాల్యూలెక్కలు వేశాకే సభను నిర్వహిస్తామని కలెక్టర్ నేరుగా ఫోన్‌లో నిర్వాసితులకు తెలిపారు. అనంతరం ఎంక్వైరీ గ్రామసభను వాయిదా వేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఇంటివాల్యూయేషన్ తరువాత మళ్లీ గ్రామసభ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఆరు గ్యారెంటీలతో సంక్షేమ పథకాల లబ్ధి

• ఐదు గ్రామాలకు చెందిన 250 కుటుంబాలు టీడీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజేశ్వరి

ఎటపాక, జనవరి 5: టీడీపీ మ్యానిఫెస్టోలో భాగంగా పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం వంతల రాజేశ్వరి సమక్షంలో వైసీపీకి చెందిన 250 కుటుంబాలు టీడీపీలో చేరాయి. లక్ష్మీపురం, లింగాలపల్లి, పాలమడుగు, బూరుగువాయితండా, బాసవాగు గ్రామాల్లోని 250 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వంతల రాజేశ్వరి ఆ కుటుంబాలను పార్టీ జెండా కప్పి ఆహ్వానించారు. అందుకు ముందు ఈ ఐదు గ్రామాల్లో టీడీపీ పార్టీ దిమ్మలను, టీడీపీ జెండాను రాజేశ్వరి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి మాట్లాడారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పే వాళ్లు వస్తుంటారని, వారి మాటలు చెప్పి, మభ్యపెడతారని, వారిమాటలను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పుట్టి రమేష్ బాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, మండల ప్రధాన కార్యదర్శి మేటికోటి అప్పలస్వామి, వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, చోడవరం ఎంపీటీసీ పెనుబల్లి కృష్ణకుమారి, నాయకులు ముప్పా శ్రీనువాస్, సున్నం వెంకటరమణ, కానూరి బుల్లెబ్బాయి, ఏపూరి వెంకన్న, రాజేష్, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

• రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



దేవీపట్నం, జనవరి 5: లబ్ధిదారులకు సకాలంలో తెల్లరేషన్ కార్డు ఆయా గ్రామాల ద్వారా సకాలంలో అందించాలని రంపచోడవరం సబ్‌కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం దేవీపట్నం మండలం వివిధ గ్రామాలలో సబ్‌కలెక్టర్ పర్యటించారు. ముందుగా ఇందుకూరు, ఇందుకూరుపేట గ్రామాలలో రేషన్‌షాపులు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీలకు రేషన్ సరఫరా, ఎంపీయూపీ స్కూళ్లలో మధ్యాహ్నభోజన పథకం ఏవిధంగా నిర్వహిస్తున్నారని సబ్‌కలెక్టర్ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెల్లరేషన్ కార్డు సకాలంలో లబ్ధిదారులకు అందించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను పరిశీలించి ముంపు బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సబ్‌కలెక్టర్ వెంట తహశీల్దార్ సత్యనారాయణ, సీడీపీవో సంధ్యారాణి, మండల విద్యాశాఖాధికారి, తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు'

రాజవొమ్మంగి, జనవరి 5: తమ సమస్యలు పరిష్కారించాలంటూ శాంతియుతంగా పోరాటంచేస్తున్న మిడ్ డే మిల్స్ వర్కర్లను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేయడం, నిర్బంధించడం సరికాదని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అన్నారు. రాజవొమ్మంగిలో లోత రామారావు శుక్రవారం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తమ సమస్యలు పరిష్కారించాలని కోరడానికి శుక్రవారం అమరావతి వెళుతున్న మిడ్ డే మిల్స్ వర్కర్లను రంపచోడవరం నియోజకవర్గంలో పోలీసులు అరెస్టు చేయడాన్ని లోతా రామరావు తీవ్రంగా ఖండించారు.

పోలవరం ఎమ్మెల్యేను కలిసిన దేవీపట్నం నిర్వాసితులు



పోలవరం ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం అందిస్తున్న దేవీపట్నం నిర్వాసితులు

దేవీపట్నం, జనవరి 5: పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన దేవీపట్నం గ్రామ నిర్వాసితులు శుక్రవారం ఏలూరు జిల్లా కన్నాపురం మండలం దిద్దుకూరు గ్రామంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నివాసం వద్ద ఆయనను కలిశారు. దేవీపట్నం గ్రామానికి గోకవరం మండలం గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో గృహాలకు భూమిని సేకరించి గత రెండు సంవత్సరాల క్రితం నిర్మాణపనులు మొదలుపెట్టి మధ్యలో నిలిపివేశారని దీనికితోడు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వినతిపత్రాన్ని ఆయనకు అందించారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గెడెల పెదసుబ్బారావు, చినసుబ్బారావు, సింహాంద్రి తదితరులు ఉన్నారు.

విద్యుత్ ప్రమాదంలో ఆస్తినష్టం

• గృహాలకు వెళ్లే ఫేస్, న్యూటర్ వైర్ల కలయికతో ప్రమాదం

ఎటపాక, జనవరి 5: ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలో శుక్రవారం సంభవించిన విద్యుత్ ప్రమాదంలో ఆస్తినష్టం జరిగింది. అకస్మాత్తుగా జరిగిన విద్యుత్ ప్రమాదంతో రిఫ్రిజిరేటర్లు, గ్రైండర్లు, రిఫ్రీజిరేటర్లు, గ్రైండర్లు, 1హెచ్‌పీ మోటార్లు, విద్యుత్ మీటర్లు కాలిపోయాయి. గృహా లకు వెళ్లే విద్యుత్ వైర్ల లైన్‌లో వానరాలు చేరి, ఆటూ ఇటూ ఆడడంతో ఫెస్, న్యూటర్ వైర్లు కలిసి మంటలు వ్యాపించి, ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రెండువైర్ల కలయిక సమయంలో ఆన్‌లో ఉన్న టీవీలు, ఫ్రీజ్ లు, మోటార్లు, బల్బులు కాలిపోయినట్లు చెప్పారు. గతంలో ఇదే తరహాలో విద్యుత్ ప్రమాదాలు జరిగి ఆస్తినష్టం జరిగినా, ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది పట్టించుకోవ డంలేదని వాపోతున్నారు.

ఈవీఎంలపై విద్యార్థులకు అవగాహన

రంపచోడవరం, జనవరి 5: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఈవీఎంలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటుహక్కు ఆవశ్యకతపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు ఎన్‌వీవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏజెన్సీలో అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే ధనలక్ష్మి

రంపచోడవరం, జనవరి 5: ఏజెన్సీలో అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళా శాలలో కొత్త ఫించన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెంచిన రూ.3000 పింఛ ను జనవరి నుంచి అందజేస్తామన్నారు. మండలంలో 4597 పింఛన్లు ఉండగా మరో 81 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా రైతులకు కొండపోడు భూములను హక్కులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు కె.బాలకృష్ణ, కొండ కుమారి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లు, ఎంపీడీవో హరికృష్ణ, ఈ వోపీఆర్డీ జాన్‌విల్సన్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రికి బయలుదేరిన భవానీ భక్తులు

వరరామచంద్రాపురం, జనవరి 5: ఇంద్రకీలాద్రికి భవానీ మాలధా రణ భక్తులు శుక్రవారం అమ్మవారి మొక్కులు తీర్చుకునేం దుకు ఇంద్రకీలాద్రికి బయలుదేరారు. గత 20 సంవత్సరాలుగా మండలంలో ప్రతిఏటా భక్తులు వందలసంఖ్యలో భవానీ దీక్షామాళలు ధరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. దీక్షాకాలం పూర్తి చేసుకొని శుక్రవారం భవానీ భక్తులు గురుమాత పర్వతవర్థిని దగ్గర ఇరుముడులు కట్టించుకొని ఇంద్రకీలాద్రికి బయలుదేరారు.

'షర్మిల చేరికతో కాంగ్రెస్‌కు మంచి రోజులు'

కడియం, జనవరి 5: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం ఓ శుభ పరిణామమని, ఆమె రాకతో కాంగ్రెస్‌కు మంచిరోజులు వచ్చాయని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడాల కొండ్రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని, రానున్న ఎన్నికల్లో ఏపీలోనూ సత్తా చాటడం ఖాయమన్నారు.

వైసీపీ మునిగిపోతున్న నావ

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 5: వైసీపీ మునిపోతున్న నావని, నావలో ప్రయాణిస్తే తామూ మునిగిపోతామని తెలుసుకున్న నాయకులు వేరే దారులు వెతుక్కుంటున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రామవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరినీ వాడుకుని వదిలేయడం జగన్‌రెడ్డి తత్వమని, ఎన్నికల ముందు తండ్రి వైఎస్ఆర్ బొమ్మను వాడుకుని నేడు అదే బొమ్మను కనుమరుగు చేశాడన్నారు. అనేక వ్యవస్థలను ఆయన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని, చివరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు సహా అనేక మంది మోసపోయి నేడు రోడ్డున పడ్డారన్నారు. పార్టీ మారుతారన్న అనుమానంతో సొంత కార్యకర్తలపైనే దాడులు చేయించే స్థితికి అనపర్తి నియోజకవర్గంలో వైసీపీ చేరుకుందన్నారు. సమావేశంలో గొలుగూరి భాస్కరరెడ్డి, సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దుప్పలపూడిలో 'భవిష్యత్‌కు గ్యారెంటీ'

మండలంలోని దుప్పలపూడిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ తెలియని నాయకుడి పాలనలో వ్యవస్థలు దెబ్బతిన్నా యన్నారు. చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్ర మంలో నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, చిర్ల గంగిరెడ్డి, కుంత్సం కాశావిశ్వేశ్వరరావు, సిహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం 9వ డివిజన్‌లో తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ ఆధ్వర్యంలో జరిగిన భవిష్యతకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన అర్బన్ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ పర్యటించారు. ప్రజలను కలిసి కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేను ఉన్నాను.. నేను విన్నాను.. అని చెప్పి జగన్ ఎన్నికల్లో గెలిచి అన్ని వర్గాల ప్రజలను దగా చేశాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పర్మినెంట్‌కు నోచుకోక, సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు, ఆశాలు, పారిశుధ్య కార్మికులు గొంతులు పగిలేలా నినదిస్తుంటే ఈ గుడ్డి ప్రభుత్వానికి కనిపించడంలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకిరామయ్య, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీను పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి, అనుశ్రీ



అనపర్తి: రామవరంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

మైనార్టీలకు వైసీపీ చేసిందేమిలేదు

మైనార్టీలకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమిలేదని టీడీపీ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు అహ్మద్, కార్యదర్శి లాల్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి చాన్‌బాషా మండిపడ్డారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక నగరంలో ఒక్క మసీదుగాని, షాదీఖానా గాని నిర్మించలేదన్నారు. గత టీడీపీ హయాంలోనే మూడు షాదీఖానాలు నిర్మించారని గుర్తుచేశారు. ముస్లింలకు తామేదో చేసినట్టు వైసీపీ నాయకులు చెప్పుకోవడం సరికాదన్నారు. మటన్ మర్చంట్ అసోసియేషన్‌లో అన్ని పార్టీలు వారు ఉన్నారని అయితే వారంతా వైసీపీలో చేరినట్టు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో పార్లమెంట్ కమిటి కార్యదర్శి మహబూబ్ ఖాన్, బషీర్, అహ్మదున్నీషా, అఫ్సరీ, షేక్ మదీనాసాహెబ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి



కోరుకొండలో అంగన్‌వాడీలకు మద్దతు తెలుపుతున్న బీవీఆర్ చౌదరి

కోరుకొండ, జనవరి5: 25రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణచౌదరి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేస్తున్న సమ్మెకు టీడీపీ సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కోరుకొండ గాంధీచౌక్ వద్ద అంగన్‌వాడీ చేసిన సమ్మె శిబిరంలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంటే నాగ కేశవరావు, అడపా వీరబాబు, మాతా సీతారాముడు, మాదబోయిన అప్పారావు,శామ్యూల్, పీతా శ్రీను పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అండగా జనసేన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5: సమస్యలపై పోరాడుతున్న అంగన్వాడీలకు జనసేన పార్టీ అండగా వుంటుందని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి యామన నారయణగౌడ్, జిల్లా కార్యదర్శి బీరా ప్రకాష్, రూరల్ అధ్యక్షుడు చప్పా చన్నారావు, మట్టపర్తి నాగరాజు, వేమగిరి ప్రెసిడెంట్ కొప్పుశెట్టి రాజేష్ ప్రకటించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ పోరాటాలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని వారితో కలిసి పోరాడుతామన్నారు. సమావేశంలో కొంతమూరు ఉప సర్పంచ్ అత్తిలి వెంకటరమణ, మేక గణపతి, పిల్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జనసేన సమర శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ

కోరుకొండ, జనవరి 5: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ, పార్టీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేపట్టిన జనసేన మహాపాదయాత్ర 300 రోజులకు చేరుకోవడంతో ఈ నెల 7న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్టు బలరామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయం వద్ద సమర శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బహిరంగ సభను రాజానగరంలో నిర్వహిస్తున్నామని, ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు కోరుకొండ జనసేన కార్యాలయం నుంచి వేలాది మంది ర్యాలీగా వెళతామన్నారు. సభను జయప్రదం చేయాలని బలరామకృష్ణ కోరారు.

జనసేన.. సంక్రాంతి ముగ్గుల పోటీలు

సంక్రాంతి సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 1గంటకు కోరుకొండ, సీతానగరం, రాజానగరం, దివాన్‌చెరువు గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు బలరామకృష్ణ ప్రకటించారు. ఆసక్తిగల మహిళలు ఆయా ప్రాంతాల వారీగా సమన్వయ కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. రాజానగరం గళ్ల సత్యశ్రీ రంగారావు (93813 72373), సీతానగరం సత్య (90320 21116), కోరుకొండ బదిరెడ్డి తులసిదొర (97057 54954), దివాన్‌చెరువు యర్రంశెట్టి దేవిశ్రీనివాస్ (93461 91887) నెంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బలరామకృష్ణ, ఇతర నాయకులు

నేటి నుంచి జనసేన నిత్యాన్నదానం

డొక్కా సీతమ్మ, పవన్‌కల్యాణ్ ఆశయ సాధనలో భాగంగా ఈ నెల 6 నుంచి జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు బలరామకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని అన్నార్తులకు పట్టెడు అన్నం పెట్టాలనే ఉద్దేశ్యంతో ప్రతిరోజు మధ్యాహ్నం కోరుకొండ, సీతానగరం, రాజానగరం బస్టాండ్ వద్ద నిత్యాన్నదానం ఏర్పాటుచేస్తున్నట్టు ప్రకటించారు. కుల, మత, పార్టీ విభేదాలు లేకుండా ఈ భోజనాన్నిస్వీకరించాలని కోరారు.

వాకర్స్ లాఫింగ్ క్లబ్.. పింఛన్ల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5: రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఆనంద్ గార్డెన్స్‌లో వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 80 మంది వృద్ధులకు రూ.40 వేల పింఛన్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు రాళ్లబండి సత్యవాణి, పేపరుమిల్లు రిటైర్డ్ ఉద్యోగి రొక్కం అప్పారావు, దంపతులు బిల్డర్ పోతుల వెంటకేశ్వరావు, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు.

బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

కోరుకొండ, జనవరి 5: రాష్ట్రంలో బీసీ కులాల అభ్యున్నతికి సీఎం జగన్మోహన్ జగన్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని దోసకాయపల్లిలో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని తమ ప్రభుత్వంతో జరిగిన అభివృద్ధి పోల్చి చూస్తే అసలు పొంతనే లేదన్నారు. బీసీ కులాల వారు ఫంక్షన్‌లు నిర్వహించడానికి ఈ కమ్యూనిటీ హాలు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, కర్రి లక్ష్మి, కడవల శివ, కడియాల పాపారావు, గణేశుల పోసియ్య తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 7న మండలంలోని బూరుగుపూడి గేటు వద్ద నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు సంబంధించిన ప్రాంగణాన్ని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే జక్కంపూడి పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్నివర్గాల ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలు ద్వారా అందించిన లబ్ధిని, రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవుల్లో కల్పించిన సామాజిక న్యాయాన్ని ఈ బస్సు యాత్రలో వివరిస్తారన్నారు.

నేటి నుంచి అక్షయామృతం

ఈ నెల 6వ తేదీ నుంచి జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయామృతం పేరిట నిత్యన్నదాన సేవా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎమ్మెల్యే జక్కంపూడి తెలిపారు. రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ప్రతి రోజు పేదలకు అన్నదానం కోసం అక్షయామృత వాహనాలను సిద్ధం చేశామన్నారు.

అయోధ్య రాముని అక్షితలు వితరణ



కోదండరామస్వామి ఆలయం నుంచి బయలుదేరిన రథయాత్ర

కడియం, జనవరి 5: అయోధ్య నుంచి వచ్చిన యజ్ఞ అక్షితల వితరణ కార్యక్రమం వీరవరంలో శుక్రవారం జరిగింది. ముందుగా కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై అక్షితలను ఉంచి మేళతాళాలు, వాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపారు. మహిళాభక్తులు ప్రతి ఇంటిని సందర్శించి అక్షితలను వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేగులగుంటలో ఎస్ఈబీ దాడులు

దేవరపల్లి, జనవరి 5: గోపాలపురం మండలం రేగులగుంటలో ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి మీసాల రామారావును మద్యం సీసాలతో అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ సుధా తెలిపారు.

ప్రతిఒక్కరూ దైవారాధన చేయాలి

ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



అనపర్తి, జనవరి 5: ఆధ్యాత్మికతలో మొదటి అడుగు అచంచలమైన భక్తి విశ్వాసమేనని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా దైవారాధన చేయాలని ప్రముఖ ప్రవచనకర్త గరిగపాటి నరసింహారావు అన్నారు. అనపర్తిలోని టీటీడీ కళ్యాణ మండపంలో శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సౌర్యమూర్తి భీమసేనుడు అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. భర్త పూజ గదిలోను, భార్య తులసికోట వద్ద అనునిత్యం పూజలు చేయాలన్నారు. మహాభారతంలో భీమసేనుడి సౌర్య పరాక్రమాలను వివరించారు. నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసలవుతూ మంచి చెడులను విస్మరిస్తున్నారని, వారిని పెద్దలు సక్రమ మార్గంలోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, తమలంపూడి చినఆదిరెడ్డి, కొవ్వూరి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

చందన రమేష్‌కు గన్ని కృష్ణ పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5: ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయిన మాజీ ఎమ్మెల్యే చందన రమేష్‌ను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పరామర్శించారు. శుక్రవారం కోరుకొండ రోడ్డులోని చందన కుమార్తె నివాసంలో గన్నికృష్ణ కలిసారు. ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వైసీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్‌గా వేణు

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు రాజమహేంద్రవరం రూరల్ వైసీపీ కోఆర్డినేటర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాయుడుపాలకలు గ్రామంలో వినాయకుడికి ప్రత్యేకపూజలు చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఉన్నారు. తర్వాత మంత్రి వేణు.. జక్కంపూడి రాజా ఇంటికి వెళ్లి, రాజాను, ఆయన తల్లి విజయలక్ష్మిని, తర్వాత డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజును, ఏపీ బ్యూటీఫికేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను మర్యాదపూరకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ట్రబుల్ షూటర్‌ను కాబట్టి, రాజమహేంద్రవరం రూరల్ పంపించారు. ఇక్కడ 14ఏళ్ల పాటు టీడీపీ గెలుస్తోందని, తొలిసారి వైసీపీ గెలవబోతోందన్నారు.

జీఎస్ఎల్ డెంటల్ కళాశాలకు ఎక్సలెన్స్ అవార్డులు

రాజానగరం, జనవరి 5: జీఎస్ఎల్ దంత వైద్య కళాశాలలో కల్పించిన ఆధునిక సౌకర్యాలను దంతవైద్య విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జీఎస్ఎల్ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్ సూచించారు. జీఎస్ఎల్ డెంటల్ కళాశాల 2022-23 బ్యాచ్ గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సి పాల్ సునీల్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని డెంటల్ కళాశాలల్లో తమ కళాశాలకు 2022-23 విద్యా సంవత్సరంలో అత్యధికంగా 19ఎక్సలెన్స్ అవార్డులు లభించినట్టు చెప్పారు. తమ కళాశాలలో 100 మందికి గానూ 95 మంది దంతవైద్య విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. 19 మంది పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా, వీరిలో డాక్టర్ నిఖితాశరణ్య బెస్ట్ ఆల్ రౌండర్‌గా నిలిచి నట్టు సునీల్ చెప్పారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ గోగినేని తరుణ్‌చౌదరి పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

తాళ్లపూడి, జనవరి 5: మండలంలోని పలు గ్రామాల్లో ఈవీఎం, వీవీ పాట్‌లతో ఓటింగ్, వేసిన ఓటు ఎవరికి వెళుతోందనే విషయాలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ జె.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం గజ్జరంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించామని, ఈనెల 12వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

ధవళేశ్వరం, జనవరి 5: స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద పునఃనిర్మించిన రామాలయంలో సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు, యాగాలను ప్రత్యేకంగా నిర్మించిన వేదికలో చేపట్టారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మహా అన్నసమారాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బలభద్రపురంలో వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



శేషవాహనంపై స్వామి అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

బిక్కవోలు, జనవరి 5: బలభద్రపురంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్ర వారం బ్రహ్మోత్సవాలను ప్రారంభించినట్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పవిత్రోత్సవం, పంచామృతాభిషేకం, అగ్ని మదనం, పతావిష్కరణ, శేషవాహనంపై గ్రామోత్సం, ప్రత్యేక ఉత్సవం జరిపారు. స్వామి అమ్మవార్ల దర్శనాలకు భక్తులు బారులు తీరారు. స్వామికి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సత్యనారాయణరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పారిశ్రామిక వేత్తలు కొవ్వూరి పాపారెడ్డి, చింతా పాండురంగారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

వీరుళ్లమ్మకు సహస్ర ఘటాభిషేకం

1008 మంది మహిళలతో అమ్మవారికి జలాభిషేకం



వీరుళ్లమ్మ ఘటాభిషేకానికి గోదావరి జలాలను తీసుకొస్తున్న ముత్తైదువులు



అనపర్తి, జనవరి 5: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మకు శుక్రవారం 1008 మంది ముత్తయిదువులు సహస్ర ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. గోదావరి జలాలతో అమ్మవారి మూలవిరాట్‌ను అభిషేకించారు. అమ్మవారి ఆలయాన్ని పునః నిర్మించి 45 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. అనం తరం ఆలయం నుంచి మహిళలు ఎర్రకాలువ వద్దకు చేరుకుని గోదావరి జలాలను కలశాల్లో నింపుకుని, శిరస్సున ధరించి మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు అభిషేకించారు. భక్తులకు ఆలయ కమిటీ తాంబూళం, ప్రసాదాలు పంపిణీ చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, ప్రతినిధులు పడాల కళ్యాణ్‌రెడ్డి, డీవీఆర్‌పి పాపిరెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	:	డెవిల్
సూర్యామినీ	:	ఆక్వామేన్
సూర్యాప్యాలస్	:	యానిమల్
స్వామి	:	హాయ్ నాన్న
శివజ్యోతి	:	మాయాబజార్
అనుశ్రీ(సాయికృష్ణ)	:	డెవిల్
రాజా	:	సలార్
అశోక	:	సలార్
ఊర్వశి	:	డెవిల్
రంభ	:	బబుల్‌గమ్
మేనక	:	ఆక్వామేన్
అప్సర	:	కపాలదీవి
వీఎస్ మహల్ (నామవరం)	:	సలార్, డెవిల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	:	డెవిల్
వెంకటసూర్య(కడియం)	:	సలార్,డెవిల్
సత్యగౌరి (అనపర్తి)	:	సలార్
సూర్యశ్రీ (అనపర్తి)	:	డెవిల్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	:	డెవిల్
రామకృష్ణ(కోరుకొండ)	:	డెవిల్
గీతాసినిమాస్ (సీతానగరం)	:	హాయ్ నాన్న
శ్రీనివాస (గోకవరం)	:	డెవిల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	:	సలార్
లలితామహల్(రంపచోడవరం)	:	డెవిల్
నవయుగ(చింతూరు)	:	డెవిల్



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి,
కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో..

నేడు రాజమహేంద్రవరంలో ముత్యాల ముగ్గుల పోటీలు



రాజమహేంద్రవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది వచ్చినట్టే ఈ ఏడాది ముగ్గుల పండుగ వచ్చేసింది.. రాజమహేంద్రవరం పట్టణం జేఎన్ రోడ్డులో రిలయన్స్ డిజిటల్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయి జూనియర్ కాలేజీ ఆవరణలో "ఆంధ్ర జ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈ నెల 6న శనివారం జరగనున్నాయి.ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత ఈ పోటీలను ప్రారంభిస్తారు. ఇక జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన భవానీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరిస్తోంది. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలవారికి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్లు నమోదుకు 9985411248 నెంబర్‌లో సంప్రదించగలరు. పోటీల్లో జిల్లావ్యాప్తంగా మహిళలు పాల్గొనవచ్చు.

తెలుగు వైభవం!





సభలో మాట్లాడుతున్న బీజేపీ నేత రామ్‌మాధవ్, వేదికపై గవర్నర్ బిశ్వభూషణ్, స్వరూపానందేంద్ర, యార్లగడ్డ, చైతన్యరాజు తదితరులు.. సభలో పాల్గొన్న భాషాభిమానులు



తెలుగు మహాసభల సందర్భంగా వేదికపై ప్రదర్శిస్తున్న నృత్యరూపకం

- అట్టహాసంగా ప్రారంభమైన 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు
- హాజరైన ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్
- మహాసభలను ప్రారంభించిన స్వరూపానందేంద్ర
- 10 వేల మంది విద్యార్థులతో వేమన శతక ఆలాపన
- తొలిరోజు కవి సమ్మేళనం, భాషా ప్రక్రియలపై సదస్సు
- పలువురికి పూర్ణ కుంభ పురస్కారాలు

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 5: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలు గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శ్రీరాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రాబ్ది నీరాజనంగా, నన్నయ భట్టారకుని మహాభారతం వెయ్యేళ్లను పురస్కరించుకుని తెలుగు మహాసభలు నిర్వహిస్తున్నారు. రాజరాజనరేంద్ర, నన్నయ భట్టారక, నారాయణ భట్టు వేదికలపై సందడిగా తెలుగుదనం ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షత వహించిన ప్రధాన వేదిక శ్రీరాజరాజ నరేంద్ర వేదిక నుంచి విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి తెలుగు మహాసభలను లాంఛనంగా ప్రారంభించారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, ఛత్తీస్‌గఢ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ కార్యదర్శి వారణాసి రామ్‌మాధవ్, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, విశ్వనాథ గోపాలకృష్ణ, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, వీసీ ప్రసాదరాజు, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త వర్మ, అష్టావధాని బులుసు అపర్ణ మాట్లాడారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటాలి : బిశ్వభూషణ్

శ్రీకృష్ణ భగవానుడు గీతలో బోధించిన యదా యదా హి ధర్మస్య.. అంటూ మహా భారతాన్ని ఆదికవి నన్నయ తెలుగున అనువదించడాన్ని ప్రస్తావిస్తూ తెలుగుభాష విశిష్ఠత, ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా ఇటువంటి సదస్సులు నిర్వహించడంపై ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ నిర్వాహకులను అభినందించారు. సాహిత్య, సాంస్కృతిక కళలకు నిలయంగా శోభిల్లుతున్న గోదావరి తీరాన తెలుగు మహాసభలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గోదావరినది అన్నా, రాజమహేంద్రవరం అన్నా తనకు ఎంతో అభిమానమన్నారు. ముందుగా విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిస్వామి మాట్లాడుతూ తెలుగు భాషలాంటి భాష ఈ సృష్టిలో లేదన్నారు. ప్రపంచంలో ఎన్ని భాషలు ఉన్నప్పటికీ తెలుగు భాష మాధుర్యం, గొప్పతనం మరే భాషకు సాటిరాదని, తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సంస్కృతం కన్నా తెలుగులోనే ఎక్కువ అక్షరాలు ఉన్నాయన్నారు. బీజేపీ జాతీయ నేత రామ్‌మాధవ్ మాట్లాడుతూ తెలుగు భాషకు 2500 ఏళ్ల చరిత్ర, 1700 ఏళ్ల సాహిత్య చరిత్ర ఉందన్నారు. మన సంస్కృత భాషను మృతభాష అని ఆంగ్లేయులు వర్ణించారని, భాషలు బలహీనపడతాయేగానీ మరణించవన్నారు. వాటిని జీవింపజేసే ప్రయత్నం కింది స్థాయి నుంచి జరగాల్సి ఉందన్నారు. పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తెలుగునేలను సస్యశ్యామలం చేసిన సర్‌ఆర్థర్ కాటన్, తెలుగు నిఘంటువు రూపొందించిన సీపీ బ్రౌన్, అలాగే గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం ప్రాతఃస్మరణీయులన్నారు. తెలుగు వారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన నందమూరి తారకరామారావు, రాజ్యసభలో ఎవరి మాతృభాషలో వారు మాట్లాడే వీలు కల్పించిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడులను గుర్తు పెట్టుకోవాలన్నారు. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ మాట్లాడుతూ చదువుకన్నా సంస్కారం ప్రధానమైందని, తెలుగుభాష నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. అ అంటే అమ్మ అని, ఆ అంటే ఆవు అని నేర్చుకున్న మాటలను గుర్తుచేస్తూ అమ్మ ప్రేమకు సంకేతమైతే, ఆవు త్యాగానికి సూచికగా చెప్పారు. తెలుగు నేర్చుకుంటే సంస్కారం అలవడుతుందన్నారు. మాతృభాషపై అభిమానం ఉండాలన్నారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ తల్లి లాంటి తెలుగు భాషను మరువకూడదన్నారు. మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ తమిళ ప్రాంత పాలనలో ఉన్న యానాం నుంచి ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన తాను అసెంబ్లీలో తెలుగులోనే మాట్లాడేవాడినని గుర్తుచేశారు. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. అంతర్గత భావాలను వ్యక్తపరచడానికి మాతృభాష దోహదం పడుతుందన్నారు. జేఎన్టీయూ వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ తెలుగు మహాసభల నిర్వహణతో తెలుగుపై అందరికీ మమ కారం ఏర్పడుతుందన్నారు. చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ మహాసభల నిర్వహణతో సరిపెట్టుకోకుండా తెలుగు భాష ఉన్నతికి తమ కుటుంబం తరపున ట్రస్ట్ ఏర్పాటు చేసే యోచన ఉందన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాషలోని మాధుర్యాన్ని అందరూ ఆస్వాదించి, ప్రతి ఒక్కరూ తెలుగు భాష నేర్చుకోవాలన్నారు. తెలుగు భాషపై పట్టు సాధిస్తే ఇతర భాషలపై కూడా పట్టువస్తుందన్నారు. తాను 121 భాషల్లో గజల్స్ పాడానని చెబుతూ ఆయా భాషల వాళ్లు ఆ గజల్స్‌ను ఎంత ఆనందించారో చెప్పనలవికాదన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రవివర్మ, ఆంధ్రసారస్వత పరిషత్ ముఖ్య సలహాదారులు కె.రామ్‌ప్రసాద్, శతావధాని కడిమెళ్ల వరప్రసాద్, రెడ్డప్ప ధవేజీ, కోట్ల కనకేశ్వరరావు, మంతెన కేశవరాజు, వేటుకూరి సూర్యనారాయణరాజు, తెలుగు మహాసభల సమన్వయకర్త సునంద రమేష్, అపుస్మా అధ్యక్షుడు సంకవల్లి మురళి, పలువురు కవులు, రచయితలు, భాషాభిమానులు పాల్గొన్నారు.



ఎంపీ, సినీ రచయిత విజయేంద్రప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కవి సమ్మేళనం, భాషా ప్రక్రియపై సదస్సు

నారాయణభట్టు వేదికపై ఏర్పాటుచేసిన కవి సమ్మేళన అంకురార్పణ సభలో మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగు వైభవ కీర్తి అందరూ ఆనందించదగినదన్నారు. కవులు, రచనలు చేసేవారు వీరేశలింగం పంతులును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్రాల వారు భాషను కాపాడుకోవడానికి చేస్తున్న ఉద్యమాలను వివరించారు. కవులు తమ కవితలు ద్వారా జాతిని జాగృతం చేస్తూ తెలుగు భాషను నిలబెట్టుకోవాలని సూచించారు. ఆది కవి నన్నయ వేదికపై ఏర్పాటుచేసిన సదస్సుల అంకురార్పణ సభలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రవచనాలు, కావ్యాలు, పద్యాలు నేర్పించాలన్నారు. సంసారంలో సమస్యలకు సాహిత్యంతో పరిష్కారం లభిస్తుందని ప్రవచించారు. ప్రతిభావంతులను ఎవరూ అడ్డుకోలేరన్నారు. తిరుపతి వేంకట కవులు, చెళ్లపిళ్ల కవుల్లో దాగిన ప్రతిభకు ఎవరూ సాటిరారని చెప్పారు.

దేవరపల్లిలో ఘనంగా బాలోత్సవం

8లో



ఎంపీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పారిశుధ్య కార్మికుల భిక్షాటన

రాజమహేంద్రవరంలో మూడో రోజుకు చేరిన సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 5: రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్మిక జేఏసీ పిలుపు మేరకు పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు శుక్రవారం రాజమహేంద్రవరంలో భిక్షాటన చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడ బైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులకు పనిముట్లు కొనుగోలు చేసేందుకు నిధులు లేవని, టాయిలెట్ క్లీనింగ్ వర్కర్లకు జీతాలు లేవన్నారు. వారి సమస్యలు ఏవీ పరిష్కారం కాలేదన్నారు. పైగా సమ్మెలో కార్మికులుంటే వర్కర్ల సమస్యలపై స్పందించాల్సిన కమిషనర్ ప్రత్యామ్నాయ పనులు చేయించేందుకు చూస్తున్నారని చెప్పారు. రోజువారీ కూలీలను పెట్టి పనులు చేసేందుకు చూస్తున్నారే తప్ప కార్మికుల సమస్యలపై స్పందించకపోవడం దారుణమన్నారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మికులు ఎంపీ భరత్‌రామ్‌కు వినతిపత్రం అందించారు. తాను సీఎంతో మాట్లాడి సమ్మె పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుండ్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు, యూనియన్ నాయకులు రెడ్డి రమణ, ముత్యాల మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల కిషోర్, బంగారు గిరి, కాకి శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోండి: ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమ్మె చేస్తున్నందు వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ అధికారులను ఎంపీ భరత్‌రామ్ ఆదేశించారు. ఈ మేరకు వారితో సమావేశాన్ని నిర్వహించారు. సమ్మె వల్ల ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. చాలాచోట్ల శానిటేషన్ అధ్వానంగా కనిపిస్తోందని, సమ్మె కొలిక్కి వచ్చేవరకూ పారిశుధ్యాన్ని అలా వదిలేయడం భావ్యం కాదన్నారు. సమ్మె పరిష్కార నిర్ణయం ప్రభుత్వం చేతుల్లో ఉందని చెప్పారు.

చాముండేశ్వరి చిట్‌ఫండ్స్‌లో తనిఖీలు

ఇది ఓ వైసీపీ ప్రజాప్రతినిధి పనేనని ప్రచారం

రాజమహేంద్రవరం, జనవరి5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని చాముండేశ్వరి చిట్‌ఫండ్స్ కంపెనీ మీద స్టాంప్స్ అండ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారులు దాడులు చేశారు. ప్రముఖ చిట్‌ఫండ్ వ్యాపారి చలుమూరి శ్రీనివాసరావుకు చెందినది ఈ చాముండేశ్వరి చిట్‌ఫండ్స్. ఆయన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుకు బంధువు కూడా. ఈ దాడులు కావాలనే ఓ వైసీపీ ప్రజాప్రతినిధి చేయిస్తున్నారని, గతంలో జగదీశ్వరి చిట్‌ఫండ్స్ కంపెనీల మీద, ఇవాళ చాముండేశ్వరి చిట్‌ఫండ్స్ మీద ఉద్దేశపూర్వకంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కానీ ఈ తనిఖీల్లో ఏమైనా లోపాలు ఉన్నాయా లేదా అనేది అధికారులు స్పష్టం చేయలేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజమహేంద్రవరంలో కక్షపూరిత, ప్రతిపక్ష నేతలకు సంబంధించిన వ్యాపారాలను దెబ్బతీసే ప్రయత్నాలు మొదలయ్యాయని, ఇది మంచి పద్ధతి కాదనే వాదన కూడా ఉంది.

నవరత్నాల కింద ద్వైవార్షిక నగదు రూ. 411.74 లక్షలు జమ : కలెక్టర్

రాజమహేంద్రవరం, జనవరి5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవరత్నాల్లో భాగంగా ఏడు పథకాల కింద 2705 మంది లబ్ధిదార్లకు ద్వైవార్షిక మంజూరు కింద రూ. 411.74 లక్షలు ఆయా లబ్ధిదార్ల ఖాతాలో జమ అయినట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శక్రవారం ముఖ్యమంత్రి జగన్ తాడేపల్లి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఎంపీ మార్గాని భరత్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర, చందన నాగేశ్వర్, మేడపాటి షర్మిళారెడ్డి పాల్గొన్నారు.



వృద్ధులతో భూ రీసర్వే కార్యక్రమం నిర్వహించిన తహశీల్దారు

అభాసుపాలవుతున్న భూ రీసర్వే కార్యక్రమం

గోకవరం, జనవరి 5: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర భూరీసర్వే కార్యక్రమం ఎక్కడికక్కడ అభాసుపాలవుతోంది. ఎంతోకాలం నుంచి కాపాడుకుంటూ వస్తున్న పంట భూములు రీసర్వే పేరుతో రైతుల మధ్య తగాదాలు పెట్టే రీతిలో అధికారుల చర్యలు ఉంటున్నాయంటూ సన్న, చిన్నకారు రైతులు లబోదిబోమంటున్నారు. వాస్తవానికి రీసర్వే నిర్వహించే సమయంలో భూయజమానులతోపాటు సరిహద్దు రైతులకు కూడా సమాచారం చేరవేసి రెవెన్యూ అధికార్లు రీసర్వే నిర్వహించాలి. కానీ అటువంటి చర్యలు ఎక్కడా కనిపించడంలేదు. సంబంధింత రైతులు లేకుండానే సర్వేను అధికారులు ఇష్టానుసారంగా చేసేస్తున్నారనే విమర్శలు బలంగా ఉన్నాయి. దీంతో సర్వే అనంతరం భూముల మధ్య హెచ్చు తగ్గులు ఉన్నాయంటూ రైతులకు నోటీసులు పంపించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఈక్రమంలో బాధిత రైతులు తమ భూమిని యథాస్థానంలో నిలుపుకోవడానికి ఆర్థికంగా కూడా నష్ట పోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన చెందుతున్నారు. కాగా గోకవరం మండలం అచ్చుతాపురం గ్రామంలో భూరీసర్వేపై శుక్రవారం తహశీల్దారు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అయితే రైతులెవరూ లేకుండానే రామాలయం వద్ద కూర్చొన్న నలుగురు వృద్ధులతో గ్రామసభను మమ అనిపించడంపై రైతులు మండిపడుతున్నారు. విషయం తెలుసుకున్న కొంతమంది రైతులు గ్రామసభ వద్దకు చేరుకొని రీసర్వే తీరుపై అధికారులను నిలదీశారు. ఇటీవల జరిపిన రీసర్వేను రద్దు చేసి తిరిగి మరోమారు తమ గ్రామంలో రీసర్వే చేయాలంటూ గ్రామ రైతులు అధికారులను డిమాండు చేశారు.

బాబోయ్ కొండ చిలువలు!

- చిక్కాలలోని కొవ్వాడ కాలువ పరిసర పొలాల్లో సంచారం
- భయభ్రాంతులకు గురవుతున్న రైతులు, కూలీలు

చాగల్లు, జనవరి 5: మండలంలోని చిక్కాల గ్రామంలోని కొవ్వాడ కాలువ వెళ్లిన పరిసర పొలాల్లో కొండచిలువలు ఎక్కువగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా ఈప్రాంత పొలాల్లో కొండచిలువలు తిరుగుతున్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు వెళ్లిన సందర్భాల్లో కొండ చిలువల సంచారం చూసి భయపడుతున్నారు. గతంలో ఒక కొండచిలువను చంపగా శుక్రవారం మరొక దానిని హతమార్చినట్టు రైతు ముళ్లపూడి అప్పారావు తెలిపారు. ఈ విషయమై గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేసినట్టు చెప్పారు. అటవీశాఖ స్పందించి కొండ చిలువలను పట్టుకుని అడవుల్లో విడిచిపెట్టాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొనేలా స్థానిక అధికారులు చూడాలని కోరుతున్నారు.



శుక్రవారం చిక్కాలలో ఓ పొలంలో రైతుల చేతిలో హతమైన కొండ చిలువ

అభివృద్ధి పనులపై సమాచారమివ్వండి

కొవ్వూరు సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నారాయుడు

కొవ్వూరు, జనవరి 5: గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టవలసిన అభివృద్ధి పనులను రాతపూర్వకంగా అందిస్తే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కాకర్ల నారాయుడు అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలోని 10 గ్రామాల్లో సుమారు రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇంకనూ ఏ గ్రామంలోనైనా అత్యవసరంగా చేపట్టవలసిన పనులు ఉంటే సంక్రాంతి తర్వాత రాతపూర్వకంగా ఎంపీడీవోకు అందించాలని, వెంటనే పనులు చేపడతామన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.సుశీల, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖతోపాటు మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

తాళ్లపూడి, జనవరి 5: మండలంలోని పలు గ్రామాల్లో ఈవీఎం, వీవీ పాట్‌లతో ఓటింగ్ వేయడం, వేసిన ఓటు ఎవరికి వెళుతోంది అనే విషయాలపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం గజ్జరంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించామని, ఈ నెల 12 వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఎరువుల ధరలు తగ్గించాలి

చాగల్లు, జనవరి 5: ఎరువుల ధరలు తగ్గించాలని కోరుతూ వలడల కౌలు రైతు సంఘం నాయకులు శుక్రవారం తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా రైతు సంఘం కన్వీనర్ జీవీ సుబ్బారావు మాట్లాడుతూ పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిచౌంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన కౌలురైతులకు ఇప్పటికీ నష్టపరిహారం లభించలేదని అన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఆర్.మురళీ, తేలేటి గన్నయ్య, శ్రీరంగం రాము, పల్లంరాజు, కంకటాల బుద్ధుడు తదితరులు పాల్గొన్నారు.

యువకుల్లో క్రీడాసక్తిని ప్రోత్సహించాలి

గోపాలపురం, జనవరి 5: క్రీడా ఆసక్తి ఉన్న యువకులను ప్రోత్సహించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు అన్నారు. మండలంలోని సంజీవపురానికి చెందిన అల్లూరి సీతారామరాజు యూత్ సభ్యులకు గోపాలపురం జనసేన కార్యాలయం వద్ద రూ.10 వేలు ఆర్థికసాయంతో పాటు వాలీబాల్‌కిట్ శుక్రవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత ఉజ్వల భవిష్యత్తును కోడి పందేలు, పేకాట, గుండాట ప్రభావితం చేస్తున్నాయని, దీంతో లక్ష్యాలు చేరుకోలేక చిన్న వయస్సులోనే వ్యసనాలకు బానిసై పతనమైపోతున్నారన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు గణపతి, రామలీలాధర్, శాంత, పట్టపు రమేష్, ఇంటి వేణుగోపాల్, కూరం రవి, కురసం సోమరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉచిత ప్రయాణాలు వద్దు

దేవరపల్లి, జనవరి 5: మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా తెలంగాణాలోని లక్షలాది మంది ఆటో కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమన సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు జరుగుతున్నాయని ఆటోడ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. దేవరపల్లిలో డైమండ్ జంక్షన్ వద్ద ఆటోడ్రైవర్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిర్రా వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్రాంతి నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తారని ఆటోడ్రైవర్లు ఆందోళన చెందుతున్నామని ప్రభుత్వం ఆ పథకాన్ని విరమించుకోవాలని లేకుంటే తమ కుటుంబాలు కూడా రోడ్డున పడతాయన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు సయ్యద్ మీర, మడెల్లి సత్యనారాయణ, పాముల శ్రీను, తంగెళ్ళ సాయి, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవరపల్లిలో ఘనంగా బాలోత్సవం



బాలోత్సవంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

దేవరపల్లి, జనవరి 5: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని, ప్రతిభను వెలికి తీయడానికి బాలోత్సవాలు దోహదపడతాయని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం బాలోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బాలోత్సవ మండల కమిటీ కన్వీనర్ బలుసు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ దేశసంస్కృతి సాంప్రదాయాలు విద్యార్థుల్లో పెంపొందించడానికి బాలోత్సవ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ముందుగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పించి మౌనం పాటించారు. విద్యార్థుల కోలాటం, ఏకపాత్రాభినయం, విచిత్రవేషాలు, మట్టితో చేసిన వివిధ దేవతామూర్తులు అవతారాలు, బొమ్మలు ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మానవత కమిటీ కన్వీనర్ బలుసు సత్యనారాయణ, జనసేన నాయకుడు సువర్ణరాజు, ఎంఈవో తిరుమలదాసు, హెచ్‌ఎం శ్రీలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాసు, సీపీఎం నాయకులు నరసింహారావు, ఉండవల్లి కృష్ణారావు, బాలోత్సవ కమిటీ సభ్యులు బండి సూర్యప్రకాశరావు, పప్పు వెంకటరామారావు, సత్యనారాయణ, ఆచంట సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

సత్యవాడలో 'భవిష్యత్‌కు గ్యారంటీ'



సత్యవాడలో ఇంటింటా ప్రచారం చేస్తున్న బూరుగుపల్లి శేషారావు

ఉండ్రాజవరం, జనవరి 5: టీడీపీ మేనిఫెస్టోలోని పథకాలు ప్రజాభ్యుదయానికి ఎంతో మేలు చేస్తాయని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు అన్నారు. శుక్రవారం సత్యవాడలో టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ టీడీపీ ప్రవేశపెట్టబోయే పథకాలు ప్రతి కుటుంబానికి ఎంతో తోడ్పాటునందిస్తాయన్నారు. అనంతరం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, కేవీ సుబ్బారావు, కాకర్ల కరుణాకర్, సత్యవాడ ఇసుకపల్లి ప్రభావతి, పి.ప్రసాదరావుజు తదితరులు పాల్గొన్నారు.

రేపు టీడీపీ-జనసేన బహిరంగ సభ

పెరవలి, జనవరి 5: ఈ నెల 7న ఆచంటలో జరిగే టీడీపీ-జనసేన బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ అన్నారు. సభ ఏర్పాట్లను మాజీ మంత్రి పితాని సత్యనారాయణతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి వైసీపీ ఓడించడం ఖాయమని, దానికోసమే బహిరంగ సభలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారని, టీడీపీ, జనసేన కార్యకర్తలు ఐక్యమత్యంగా పని చేసి అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని సత్యనారాయణ కోరారు.

నిరంకుశ విధానాలను ప్రతిఘటించాలి

- ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు రమణ
- 25వ రోజు కొనసాగిన అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె

కొవ్వూరు, జనవరి 5: అంగన్వాడీలపై జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిరంకుశ విధానాలను ప్రతిఘటించాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ ఆధ్వర్యంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 25వ రోజుకు చేరింది. ఈ శిబిరాన్ని ఐఎఫ్‌టీయూ, ఏఐకేఎంఎస్ నాయకులు సందర్శించారు. రమణ మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి విడనాడి అంగన్వాడీల సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. ఏఐకేఎంఎస్ నాయకుడు పోరండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ పసి పిల్లల సంరక్షణ చూసే అంగన్వాడీలతో కంటతడి పెట్టించిన జగన్ ప్రభుత్వానికి అంగన్వాడీ తల్లుల ఉసురు తగులుతుందన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ అంగన్వాడీల ఉద్యమంపై రాష్ట్రప్రభుత్వం కొనసాగిస్తున్న అణచివేత, దమనకాండను తీవ్రంగా విమర్శించారు. కనీస వేతనంతో పాటు, గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శల సురేష్, జిల్లా అధ్యక్షుడు వెట్టి సుబ్బన్న, పీవోడబ్ల్యు నాయకులు మంగతాయారు, ఈమని మల్లిక, ఎం.సుబ్బలక్ష్మి, పద్మ, ఐఎఫ్‌టీయూ నాయకులు వి.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్, సీహెచ్ రమేష్, బాబూరావు పాల్గొని సమ్మెకు మద్దతిచ్చారు.

నిడదవోలు: నిడదవోలులో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ యంత్రాంగం జగన్ చుట్టూ, జగన్ ఎన్నికల చుట్టూ తిరుగుతూ ఉద్యోగుల, కార్మికుల నిరసనల పట్ల అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుండా.. ఉద్యోగాల్లో చేరకపోతే టెర్మినేట్ చేస్తామని బెదిరిస్తున్నారని, మరో మూడు నెలలు ఆగితే ప్రజలే వైసీపీ ప్రభుత్వాన్ని టెర్మినేట్ చేస్తారని అన్నారు. ర్యాలీలో గంటా మాధవి, రత్నకుమారి, పార్వతి, మమత, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: గోపాలపురంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం పచ్చగడ్డి తింటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో చేపట్టిన సమ్మెలో అంగన్వాడీ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీలు సమ్మె విరమించి విధుల్లో చేరాలని హెచ్చరిక జారీ చేసిందని, హెచ్చరికలు పట్టించుకునే పనిలేదన్నారు. తమకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, డిమాండ్లను నెరవేర్చకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. పద్మకామేశ్వరి, కుమారి, గంగాభవాని, దేవిసావిత్రితదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్వాడీలు



నిడదవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



గోపాలపురంలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కోడిపందేలపై ఉక్కుపాదం

అవగాహనా సమావేశంలో గోపాలపురం తహశీల్దార్ రవీంద్రనాథ్

గోపాలపురం, జనవరి 5: సంక్రాంతి పండుగ ముసుగులో నిర్వహించే కోడిపందేలు, గుండాట, పేకాటపై ఉక్కుపాదం మోపుతామని తహశీల్దార్ రవీంద్రనాథ్ హెచ్చరించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కోడిపందేల నియంత్రణపై శుక్రవారం నిర్వహించిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కోడిపందేల బరులు ఏర్పాటు చేయకుండా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దీని పర్యవేక్షణకు మండల స్థాయిలో తహశీల్దార్, ఎస్‌ఐ ఎంపీడీవోలతో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశామని, మండలంలో 7గ్రామాల్లో 9చోట్ల కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు గుర్తించామన్నారు. సదరు ప్రాంతాల్లో కోడిపందేలు జరగకుండా గ్రామస్థాయి సిబ్బంది పని చేయాలన్నారు. ఎక్కడైనా బరులు సిద్ధం చేస్తున్నట్టు తెలిస్తే త్రిసభ్య కమిటీకి సమాచారం ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించినా, గైర్హాజరైనా శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో డీటీ కృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

కోడిపందేలు జరగకుండా చర్యలు

పెరవలి, జనవరి 5: రాబోయే సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడి పందేలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ రాజరాజేశ్వరి ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గతంలో కోడిపందాలు ఆడిన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, ఏ గ్రామంలోనూ పందేలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో జరుగుతున్న ఏర్పాట్లపై పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు.

ఉద్యోగులు, కార్మికులపై జగన్‌రెడ్డి తప్పుడు కేసులు

- టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ.. మునిసిపల్ కార్మికుల సమ్మె



మున్సిపల్ కార్మికులకు మద్దతు తెలుపుతున్న టీడీపీ ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, జనవరి 5: ఉద్యోగులను, కార్మికులను భయపెట్టి, తప్పుడు కేసులు పెట్టి జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశాడని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. శుక్రవారం కొవ్వూరు మునిసిపల్ కార్యాలయం ఎదుట మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన 11వ రోజు సమ్మెకు వారు మదద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉండగా మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేస్తానని, గ్రాట్యూటీ అమలు చేస్తానని హామీలిచ్చి, అధికారం చేపట్టి ఐదేళ్లవుతున్నా హామీలు నెరవేర్చలేదన్నారు. డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న కార్మికులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం బాధాకరమన్నారు. కార్మికుల సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్మిక సంఘం నాయకులు రాజాన అప్పారావు, మీసాల కిషోర్ మాట్లాడుతూ చెత్త డంపింగ్ యార్డుకు తరలించే కాంపాక్టర్ ఆపరేటింగ్‌పై అవగాహన లేని డ్రైవర్‌ను ఎక్కించారని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవ్వరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కాంపాక్టర్‌ను అడ్డుకుని డ్రైవర్‌ను నిలదీశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, జీజీ చలం, వేమగిరి వెంకట్రావు, కాగిత రఘు, మున్సిపల్ కార్మికులు పూజారి వాసు, భూపతి రవీంద్ర, కళ్యాణి రాజేష్, మీసాల ప్రేమ్, ఎం.జ్యోతి, కె. ప్రసాద్, ఎం.శ్రీను, వి.శ్యాం పాల్గొన్నారు.

కడుపు నింపేది టీడీపీ.. కడుపు కొట్టేది వైసీపీ

- టీడీపీ గోపాలపురం ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జనవరి 5: పేదలకు కడుపు నింపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు ప్రభుత్వంలో అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తే జగన్ అధికారంలోకి వచ్చాక వాటిని మూతవేయించి పేదల కడుపుకొట్టారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గోపాలపురంలో కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లో శుక్రవారం జగన్నాథపురానికి పసుమర్తి రాఘవచౌదరి (బొజ్జా) సమకూర్చిన ఆహారాన్ని పేదలకు మద్దిపాటి వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నక్యాంటీన్లు మూతపడడంతో పేదలు ఆకలి దప్పులతో అలమటించే దుస్థితి జగన్ ప్రభుత్వంలో నెలకొందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 65లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చేతివాటం ప్రదర్శించారని, ఐదేళ్లలో సుమారు రూ.38 వేలు కోట్ల పింఛన్ల సొమ్ము కొల్లగొట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నూతంగి దొరబాబు, సురేష్, ప్రసాద్‌బాబు, కొడూరి రఘురామ్, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా కొవ్వూరుపాడుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ షేక్ కాశీం అల్లుడు మీరావల్లి పార్టీకి ఎన్నో సేవలు చేశారని, ఆయన మృతి తీరని లోటని మద్దిపాటి అన్నారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

వైసీపీకి ఇవే చివరి ఎన్నికలు

దేవరపల్లి, జనవరి 5: మండలంలోని యాదవోలులో శుక్రవారం సాయంత్రం సుదురుమాటి శ్రీనివాస్, అంజిబాబు ఆధ్వర్యంలో టీడీపీ గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎన్‌టీఆర్, బాబు జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు మద్దిపాటి వెంకట్రాజు నివాళులర్పించారు. గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి సుమారు 100మంది టీడీపీలో చేరగా వారికి మద్దిపాటి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ వైసీపీకి ఇవే చివరి ఎన్నికలని, వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో ప్రజలు విసుగెత్తిపోయి టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. 2024లో మరో కురుక్షేత్రం జరుగుతుందని దానిలో మనమంతా పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలన్నారు. ముంగనూరి రమేష్, కరుటూరి శివాజీ, కరుటూరి కృష్ణ, గుదే నాగేంద్ర, సాధనాల శ్రీనుతోపాటు మరో 95మంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఆంద్రూ అనీల్, రొంగల సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, సీహెచ్ అశోక్, అంజిబాబు, పరిమి కృష్ణ, శ్రీరామకృష్ణ, పెనుమత్స సుబ్బరాజు పాల్గొన్నారు.



యాదవోలులో టీడీపీలో చేరిన వారితో కలిసి అభివాదం చేస్తున్న మద్దిపాటి

రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

నల్లజర్ల, జనవరి 5: మండలంలోని ఘంటావారిగూడెంలో టీడీపీ సమావేశం మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మద్దిపాటి వెంకట్రాజు విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసుగు చెందారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన 15మంది కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. వెంకట్రాజు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాజులపాటి గంగాధర్, తాతిన సతీష్ శ్రీరామ్‌చౌదరి, కోసనం కిట్టు, కంచిచర్ల రాజేష్, ముత్యం సిరి, కొరపాటి బాబీ, బన్ని పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షితలు వితరణ

కడియం, జనవరి 5: అయోధ్య నుంచి వచ్చిన యజ్ఞ అక్షితల వితరణ కార్యక్రమం వీరవరంలో శుక్రవారం జరిగింది. ముందుగా కోదండరామ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై అక్షితలను ఉంచి మేళతాళాలు, వాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపారు. మహిళాభక్తులు ప్రతి ఇంటిని సందర్శించి అక్షితలను వితరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ

ధవళేశ్వరం, జనవరి 5: స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద పునఃనిర్మించిన రామాలయంలో సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూడు రోజులుగా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు, యాగాలను ప్రత్యేకంగా నిర్మించిన వేదికలో చేపట్టారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం మహా అన్నసమారాధన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బలభద్రపురంలో వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



బిక్కవోలు, జనవరి 5: బలభద్రపురంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలను ప్రారంభించినట్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పవిత్రోత్సవం, పంచామృతాభిషేకం, అగ్ని మదనం, పతావిష్కరణ, శేషవాహనంపై గ్రామోత్సం, ప్రత్యేక ఉత్సవం జరిపారు. స్వామి అమ్మవార్ల దర్శనాలకు భక్తులు బారులు తీరారు. స్వామికి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు, ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి, సత్యనారాయణరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పారిశ్రామిక వేత్తలు కొవ్వూరి పాపారెడ్డి, చింతా పాండురంగారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

వీరుళ్లమ్మకు సహస్ర ఘటాభిషేకం

1008 మంది మహిళలతో అమ్మవారికి జలాభిషేకం



వీరుళ్లమ్మ ఘటాభిషేకానికి గోదావరి జలాలను తీసుకొస్తున్న ముత్తైదువులు

అనపర్తి, జనవరి 5: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మకు శుక్రవారం 1008 మంది ముత్తయిదువులు సహస్ర ఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. గోదావరి జలాలతో అమ్మవారి మూలవిరాట్‌ను అభిషేకించారు. అమ్మవారి ఆలయాన్ని పునః నిర్మించి 45 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి మహిళలు ఎర్రకాలువ వద్దకు చేరుకుని గోదావరి జలాలను కలశాల్లో నింపుకుని, శిరస్సున ధరించి మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అమ్మవారిని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు అభిషేకించారు. భక్తులకు ఆలయ కమిటీ తాంబూళం, ప్రసాదాలు పంపిణీ చేసింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, ప్రతినిధులు పడాల కళ్యాణ్‌రెడ్డి, డీవీఆర్‌ఏ పాపిరెడ్డి, చిర్ల వెంకటరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'షర్మిల చేరికతో కాంగ్రెస్‌కు మంచి రోజులు'

కడియం, జనవరి 5: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం ఓ శుభ పరిణామమని, ఆమె రాకతో కాంగ్రెస్‌కు మంచిరోజులు వచ్చాయని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడాల కొండ్రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని, రానున్న ఎన్నికల్లో ఏపీలోనూ సత్తా చాటడం ఖాయమన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఉండ్రాజవరం, జనవరి 5: విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. శుక్రవారం ఉండ్రాజవరం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని, మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జడ్పీటీసీ నందిగం భాస్కరరామయ్య, ఎంఈవో సక్సేనరాజు పాల్గొన్నారు. కాగా గ్రామంలో లబ్ధిదారులుకు పెరిగిన పింఛను, కొత్తగా మంజూరైన వారికి ఎమ్మెల్యే పింఛన్లను పంపిణీ చేశారు.

వేళ్లచింతలగూడెంలో 'ఆరోగ్య సురక్ష'

గోపాలపురం, జనవరి 5: ప్రతిఒక్కరి ఆరోగ్యానికి వ్యక్తిగత భరోసాను సీఎం జగన్ కల్పించారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వేళ్లచింతలగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. పలువురికి ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గేళ్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేగులగుంటలో ఎస్‌ఈబీ దాడులు

దేవరపల్లి, జనవరి 5: గోపాలపురం మండలం రేగులగుంటలో ఎస్‌ఈబీ అధికారులు దాడులు చేసి మీసాల రామారావును మద్యం సీసాలతో అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ సుధా తెలిపారు. అలాగే 8మంది పాత కేసుల్లో అరెస్టైన వారిని తహశీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ సుధీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాజమహేంద్రవరం రూరల్ కోఆర్డినేటర్‌గా వేణు

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు రాజమహేంద్రవరం రూరల్ వైసీపీ కోఆర్డినేటర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాయుడుపాలకలు గ్రామంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత మంత్రి వేణు.. జక్కంపూడి రాజా ఇంటికి వెళ్లి, రాజాను, ఆయన తల్లి విజయలక్ష్మిని, తర్వాత డీసీసీబీ ఛైర్మన్ ఆకుల వీర్రాజును, ఏపీ బ్యూటీఫికేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్‌ను మర్యాదపూరకంగా కలిశారు.

నల్లజర్లలో పింఛన్ల పంపిణీ



నల్లజర్లలో పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల, జనవరి 5: ఎన్నికల హామీలను సీఎం జగన్ నూరుశాతం అమలు చేశారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శుక్రవారం నల్లజర్ల సచివాలయం వద్ద పింఛన్‌దారులతో సమావేశం ఏర్పాటు చేసి పెరిగిన మూడు వేల పింఛన్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లజర్ల మండలంలో 1100మంది లబ్ధిదారులకు పింఛన్ సక్రమంగా అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి నూతనంగా ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంకా జయలక్ష్మి, అప్పారావు, ఎంపీడీవో రాజశేఖర్, తహశీల్దార్ కిషోర్, కారుమంచి రమేష్, గగ్గర శ్రీను, వామిశెట్టి పావని, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ దైవారాధన చేయాలి

ప్రవచన కర్త గరిగపాటి నరసింహారావు



అనపర్తి, జనవరి 5: ఆధ్యాత్మికతలో మొదటి అడుగు అచంచలమైన భక్తి విశ్వాసమేనని, ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా దైవారాధన చేయాలని ప్రముఖ ప్రవచనకర్త గరిగపాటి నరసింహారావు అన్నారు. అనపర్తిలోని టీటీడీ కళ్యాణ మండపంలో శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి సౌర్యమూర్తి భీమసేనుడు అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. భర్త పూజ గదిలోను, భార్య తులసికోట వద్ద అనునిత్యం పూజలు చేయాలన్నారు. మహాభారతంలో భీమసేనుడి సౌర్య పరాక్రమాలను వివరించారు. నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు బానిసలవుతూ మంచి చెడులను విస్మరిస్తున్నారని, వారిని పెద్దలు సక్రమ మార్గంలోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి, తమలంపూడి చినఆదిరెడ్డి, కొవ్వూరి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1: డెవిల్
వై.స్ర్కీన్2 : సలార్
దేవిశ్రీ(గాయత్రి) : హాయ్ నాన్న
అనన్య : సలార్

నిడదవోలు
వీ మ్యాక్స్ : డెవిల్
రాధాకృష్ణ : హాయ్ నాన్న
శ్రీగణపతి : సలార్

దేవరపల్లి
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : సలార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : సలార్

నల్లజర్ల
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ : సలార్
శ్రీనివాస : సలార్